ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించగలం

'కాసాని'కి ఓటు.. బీసీల విజయానికి తొలిమెట్టు

బీసీల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాన్ని నిజం చేద్దామంటున్న బీసీ సంఘాలు



కాంగ్రెస్‌కు విభజించడం, పాలించడం అలవాటైందని బీసీ సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే బీసీలు అణచివేతతోపాటు అభివృద్ధిలో వెనుకబాటుకు గురవుతామని హెచ్చరిస్తున్నారు. బీసీకి చెందిన వ్యక్తి పార్లమెంటులో ఉంటేనే నిధులు, విధుల గురించి పోరాటం చేసే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఇప్పటివరకు రాని అవకాశం చేవెళ్లలో బీసీలకు వచ్చిందని, బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామని స్పష్టం చేస్తున్నారు. బీసీల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదాన్ని కాసాని గెలుపుతోనే నిజం చేద్దామని పిలుపునిస్తున్నారు. కాసానికి వేసే ప్రతి ఓటు బీసీల విజయానికి తొలిమెట్టుగా భావించాలని, కాసాని గెలిస్తే పార్లమెంటులో బీసీల ప్రాతినిథ్యం కూడా పెరుగుతుందని వివరిస్తున్నారు. బీసీల్లోని అన్ని కులాలు ఏకతాటిపైకి రావాలని, బీసీల పట్ల చులకన భావంతో మాట్లాడుతున్న నేతల నోళ్లకు చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల ఫలితంతో తాళం వేయాలని కోరుతున్నారు. **రంగారెడ్డి, మే 7 (నమస్తే తెలంగాణ)**

అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒదులుకోం

మన బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒదులుకోం. అగ్రవర్గాల రాజకీయ నాయకులను గతంలో గెలిపించుకుంటే వారి వల్ల బీసీలకు ఎలాంటి లాభం జరుగలేదు. కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీ అందించి బీసీల సత్తా చాటుదాం. బీసీ నేతను గెలిపించుకుంటే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రావు.

- గొల్ల గోరెప్ప, హాజీపూర్, యాలాల మండలం

చేవెళ్ల గడ్డపై బీసీల ఐక్యత చాటుతాం

మన బీసీల గొంతుకను లోక్‌సభలో వినిపిద్దాం. ఈ గొప్ప అవకాశాన్ని చేజార్చుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. బీసీలకు బీఆర్ఎస్ అవకాశం కల్పించింది. బీసీలు ఏకం కావాల్సిన సమయం వచ్చింది. బీసీ అభ్యర్థిని గెలిపించుకుంటేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. రాజకీయాలను అందరం పక్కన పెట్టి పార్టీల కతీతంగా కాసాని గెలుపునకు కృషి చేద్దాం.

- ఈడిగి నర్సింహులు, హాజీపూర్, యాలాల మండలం

బీసీ నేతను గెలిపించుకుందాం

బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంచి పట్టున్న నేత. జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీగా పనిచేసిన నాయకుడు కాసానికి బీఆర్ఎస్ అధినేత చేవెళ్ల ఎంపీ టికెట్ కేటాయించడం గొప్ప పరిణామం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలందరం ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- శేరిగూడెం వెంకటయ్య, నాగరకుంట(షాబాద్)

బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

చేవెళ్ల గడ్డపై ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా ఎగురవేసేందుకు అందరూ కృషి చేయాలి. గతంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీలుగా గెలిచిన ఇద్దరు నాయకులు సొంత ప్రయోజనాల కోసం కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. బీసీ నేత కాసానికి ఎంపీ అభ్యర్థిగా కేసీఆర్ అవకాశం కల్పించారు. బీసీ సోదరులంతా ఒకసారి ఆలోచించి, జ్ఞానేశ్వర్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- సాయికిరణ్‌గౌడ్, చందనవెల్లి(షాబాద్)

పేదలకు, ఉన్నతులకు మధ్య యుద్ధం

సమాజంలో నెలకొన్న అసమానతలు పూర్తిగా సమసిపోవాలని పోరాడుతున్నా. ఇంకా కొందరు వాటిని కొనసాగించి రాజకీయ లాభం పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. జనాభాలో తగు సంఖ్య ఉన్నప్పటికీ ఇప్పటికీ బీసీ వర్గాలు ప్రధానంగా రాజకీయంగా వెనుకబాటులోనే ఉంటున్నారు. ఈ వర్గాన్ని గుర్తించి చేవెళ్ల ఎంపీ స్థానాన్ని బీసీ బిడ్డకు ఇచ్చి కేసీఆర్ వారి పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారు.

- పద్మ ముదిరాజ్, ఎల్లమ్మబండ

నిలబడతాం.. నిలబెట్టుకుంటాం..

ఏండ్ల తరబడి రాజకీయ నేతలకు ఓటు బ్యాంకుగానే తప్ప వెనుకబడిన వర్గాలు వారి కంటికి కనబడే పరిస్థితి లేదు. అందుకు మా వర్గానికి చెందిన కాసానికి చేవెళ్ల ఎంపీ స్థానాన్ని ఇచ్చిన బీఆర్ఎస్‌కు మేం కృతజ్ఞతలు తెలుపుతున్నాం. బీసీ బిడ్డలంతా ఈ ఎన్నికల్లో ఐక్యంగా నిలబడమే కాకుండా మా అభ్యర్థిని విజయ తీరాలపై నిలబెట్టుకుంటాం. **- వెన్నెల ముదిరాజ్, ప్రశాంత్‌నగర్**

బీసీలంతా ఏకతాటిపైకి రావాలి

బీసీలు చైతన్యం చాటే సమయం అసన్నమైంది. ఓట్లు మావే, గెలుపు మనదే. రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తెచ్చిన నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్. బీసీల గళం పార్లమెంట్‌లో వినిపించాలంటే జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరమున్నది. కాంగ్రెస్ శ్రేణులు అహంకారపూరితంగా చేస్తున్న వ్యాఖ్యలకు మన ఐక్యతే చెంపపెట్టు కావాలి. **- పబ్బు శేఖర్**

కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

బీఆర్ఎస్ నాయకులు పోటీ చేస్తున్న ప్రతి చోట పార్టీలకు అతీతంగా వారిని గెలిపించుకుందాం. బీసీలను అవమానపర్చేలా మాట్లాడుతున్న అగ్రవర్గ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలి. బీసీలోని 96 కులాలు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం వైపు నడవాలి. మన ఓట్లు మనకే అనే నినాదంతో ముందుకెళ్లాలి. జ్ఞానేశ్వర్‌కు కేసీఆర్ టికెట్ ఇవ్వడం సంతోషించదగ్గ విషయం.

- కానుగుల బాలుశ్రీ

బీసీ అభ్యర్థిని గెలుపించుకుందాం

ఏన్నో ఏండ్లుగా బీసీలను ఓట్లు కాసే చెట్లుగా మార్చుకున్నారు తప్ప బీసీలకు ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు బీసీల్లో చైతన్యం వచ్చింది. మన ఓట్లు మనమే వేసుకుందాం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలను చిన్నచూపు చూస్తే ఊరుకునేదిలేదు.

- శ్రీనివాస్, మోమిన్‌కలాన్, ధారూరు మండలం

బీసీ బిడ్డను పార్లమెంటుకు పంపిద్దాం

తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకుడు, బీఆర్ఎస్ పార్టీ బలపరచిన చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంటుకు పంపిద్దాం. అగ్రవర్గాలు బడుగు బలహీన వర్గాలను అణగదొక్కుతూ రాజకీయాల్లో అవకాశం కల్పించడంలేదు. బీసీల ఓట్లతో ఎంతో మంది రాజ్యాధికారం చేపట్టారు. బరిలో నిలుచున్న జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. **- పెంటయ్య, మోమిన్‌కలాన్, ధారూరు మండలం**

చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం

బడుగు బలహీనవర్గాల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషిచేసిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను అఖండ మెజార్టీతో చేవెళ్ల గడ్డపై గెలిపించుకుంటాం. ఇన్నాళ్లు అగ్రవర్గాలకు చెందిన నాయకులకే అన్ని రాజకీయ పార్టీలు టికెట్‌ను కేటాయించి బీసీలను బానిసల్లా అణగదొక్కారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో మొదటిసారి బీసీ నేత జ్ఞానేశ్వర్‌కు టికెట్ ఇచ్చారు.

-షేక్ ముక్తార్ పాషా

సవాల్‌గా తీసుకోవాలి

బీసీల ఐక్యతకు చేవెళ్ల పార్లమెంటు సీటును ఓ సవాల్‌గా ప్రతి బీసీ నాయకుడు, ప్రజలు తీసుకోవాలి. అందరూ కలిసికట్టుగా మన ఐక్యతను చాటుకుని ఓ బీసీ నేతను పార్లమెంటుకు పంపితే మన సమస్యలపై అక్కడ గొంతెత్తే అవకాశం ఉంటుంది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సైతం అంతర్గతంగా ఆలోచించి కాసానిని గెలిపించుకునేందుకు ఏకతాటిపైకి రావాలి.

- బుద్దోలు శ్రీరాములు కురుమ, మణికొండ

కాసానికి అవకాశం కల్పించడం సరైనదే.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడే కాసాని జ్ఞానేశ్వర్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. 30 సంవత్సరాల క్రితం 96 కులాలను ఏకంచేసి రాజకీయ చైతన్యం కల్పించారు. కాసాని చైర్మన్‌గా ఉండి వేసిన ఫార్మేషన్ రోడ్లు నేటికీ ఈ ప్రాంతంలో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం చేవెళ్ల ఎంపీ స్థానానికి కాసానికి కేసీఆర్ అవకాశం కల్పించడం సరైనదే.

- సతీష్, పూడూరు

బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు

బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయింది. ప్రస్తుతం రైతులు, యువకులు, వృద్ధులు కాంగ్రెస్, బీజేపీలను నమ్మడం లేదు. గతంలో బీసీలకు న్యాయం చేయాలనే సంకల్పతో పేదల సంక్షేమమే ధ్యేయంగా జ్ఞానేశ్వర్ పనిచేశారు. కాసాని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే మంచి పేరున్న నాయకుడు.

- మధుసూదన్, పూడూరు

అందుబాటులో ఉంటా.. ఆదరించండి

చైతన్యపురి డివిజన్‌లో ప్రచార ర్యాలీలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చిత్రంలో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

ఎల్బీనగర్, మే 7: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో ఎంపీగా రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే ఒక్క రోజు కూడా నియోజకవర్గానికి రాలేదని, ప్రజల సమస్యలు పరిష్కారం చేయలేదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చైతన్యపురి డివిజన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి భారీ ర్యాలీతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి గతంలో హైదరాబాద్‌లో, ఎల్బీనగర్ నియోజకవర్గంలో వరదలు వచ్చినా రాలేదని, ప్రస్తుతం సీఎం అయ్యాక కూడా నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. కొడంగల్ నియోజకరర్గానికి రూ.3,500 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి ఎల్బీనగర్‌కు ఎలాంటి నిధులు ఇవ్వలేదన్నారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ నగరం, ఎల్బీనగర్ నియోజకవర్గం ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సాధించిందన్నారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో కేసీఆర్ ముందుంచారన్నారు. వారంటీ లేని గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే నాయకుడు లక్ష్మారెడ్డి అని అన్నారు. గెలిచాక ప్రజలకు అందుబాటులో లేని ఎంపీలను గెలిపించుకుంటే ఏం లాభమని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలతో, అమలు కాని హామీలతో ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లవేలలా అందుబాటులో ఉండే స్థానికుడినైన తనను గెలిపించాలని, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రజల వాణిని పార్లమెంటులో బలంగా వినిపించి తెలంగాణ ప్రజలకు మేలు చేసేందుకు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేశ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, సోంటి చంద్రశేఖర్‌రెడ్డి, నాగలక్ష్మి, శరత్‌చంద్ర, శివప్రకాశ్, రవితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యం

చంపాపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

చంపాపేట, మే 7: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే తమ లక్ష్యమని బీఆర్ఎస్ నేత వింజమూరి రాఘవాచారి అన్నారు. మంగళవారం చంపాపేట డివిజన్ పరిధిలోని పవన్‌పురి కాలనీ, అంజిరెడ్డి కాలనీ, ఈస్ట్ మారుతీనగర్, పద్మానగర్, న్యూపద్మానగర్ సూర్యనగర్ కాలనీ, క్రాంతినగర్ కాలనీల్లో బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోగిరెడ్డి అంజిరెడ్డి, చేగోని మల్లేశ్‌గౌడ్, ఉష, రమాదేవి పాల్గొన్నారు.

నూతన నియామకం

ఆర్కేపురం, మే 7: తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడిగా బొజ్జ రామ్మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కలకొండ లక్ష్మణ్ అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జ రామ్మోహన్ మాట్లాడుతూ.. సరూర్‌నగర్ మండలంలో స్టూడెంట్ ఆర్గనైజేషన్ బలోపేతానికి కృషి చేస్తూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు.

అపర భగీరథుడు కేసీఆర్

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న బీజేపీ సీనియర్ నాయకుడు బాతరాజు శంకర్ తదితరులు

మన్సూరాబాద్, మే 7: దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఎంఈరెడ్డి గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బాతరాజు శంకర్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యత్తులో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేనని తెలిపారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉంటూ సమస్యలను తెలుసుకుని పరిష్కరింపజేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. బాతరాజు శంకర్ మాట్లాడుతూ.. తాగు, సాగు నీటి సమస్యలను పరిష్కరించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు మాజీ ముఖ్యమంత్రికి బాసటగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, అత్తాపురం రాంచంద్రారెడ్డి, రుద్ర యాదగిరి, సిద్దగోని జగదీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హరిహరపురం కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి.. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

వనస్థలిపురం, మే 7: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని హరిహరపురం కాలనీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సభ్యులు కోరారు. మంగళవారం ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. చిన్న చిన్న కారణాలతో ఓటు వేయకుండా ఉండిపోవద్దన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కును తేలికగా తీసుకోవద్దని, ఓటు ఎంతో శక్తివంతమైనదన్నారు. మే 13న ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు స్వతంత్ర్యరెడ్డి, రాయుడు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఓటర్ అవగాహన సదస్సు

ఆర్కేపురం, మే 7 : రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి పద్మజా రమణ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ మహిళా సాధికారిక కేంద్రంలో మంగళవారం ట్రాన్స్‌జెండర్లకు ఓటర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఓటర్ అవగాహన సదస్సులో ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్, ఐడీకార్డ్స్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ కోసం కావాల్సిన అఫిడవిట్స్ నోటరీ పత్రాలను ముకుందామాల, క్వీర్ బందు పేరెంట్స్ అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపకులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పద్మజా రమణ మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటర్ లిస్ట్‌లో తమను నమోదు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లు ఎక్కడైనా వివక్షతకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, వినితాదేవి, రచన, ఆర్తి, విజయభాస్కర్, మంజుల, శ్రీకాంత్, కవిత, స్రవంతి తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్ ఓటర్ అవగాహన సదస్సులో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి పద్మజా రమణ

సాగర్ రహదారిపై పండ్ల దుకాణాలు తొలగించాలి

వనస్థలిపురం, మే 7: సాగర్ రహదారి పక్కన పదుల సంఖ్యలో వెలసిన పండ్ల దుకాణాలను ఎత్తివేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సాగర్ కాంప్లెక్స్ వద్ద రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా పండ్ల షాపులు ఏర్పాటు చేయడం వలన నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. మూడు రోజుల క్రితం మారణాయుధాలతో దాడి చేసుకున్న సంఘటనను గుర్తు చేశారు. అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే దుకాణాలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్నవారిని పోలసులు అరెస్టు చేసి, సొంత పూచీకత్తుపై వదిలేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

మధుయాష్కీ గౌడ్, సునీతా మహేందర్‌రెడ్డి, రామ్మోహన్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందీప్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, మే 7: బీజేపీ బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ముడుపు సందీప్‌రెడ్డి తన అనుచరులతో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి పార్టీలో చేరుతున్నామన్నారు. దేశంలో బీజేపీ విధానాలు ప్రజా వ్యతిరేకంగా మారుతున్నాయన్నారు. ప్రజలంతా సోదర భావంతో మెలిగే సమాజం కోసం కృషి చేస్తామన్నారు. మల్కాజిగిరి ఎంపీగా పట్నం సునీతా మహేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

గ్యారంటీల అమలుకు కృషి

కందుకూరు, మే 7: గ్యారంటీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. జబ్బారుగూడ మాజీ సర్పంచ్ సుగుణమ్మ, పెద్దమ్మతండా ఉప సర్పంచ్ రేఖానాయక్, గుమ్మడవెల్లి, దన్నారం, ముచ్చర్ల గ్రామాల నుంచి ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి, శ్రీధర్ ముదిరాజ్, కృష్ణానాయక్, మల్లేశ్, వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, రాంచంద్రరెడ్డి లచ్చానాయక్, పాండుగౌడ్, అందుగుల సత్యనారాయణ, సులేమాన్, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ఓటుతో బుద్ధి చెప్పాలి

కందుకూరు, మే 7: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని కోరుతూ.. మండల పరిధిలోని అగర్‌మియగూడ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఈర్లపల్లి భూపాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు కొండల్ రెడ్డి, హబీబ్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాసాని గెలుపుతోనే చేవెళ్ల అభివృద్ధి

ఆర్కేపురం, మే 7 : చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మంగళవారం సరూర్‌నగర్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1లో బీఆర్ఎస్ శ్రేణులు గడప గడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి పాలనలో బస్తీల్లో బతుకుల ఆగమయ్యాయని, బస్తీల్లో నీళ్లు రావట్లేదని ప్రజాపాలనలో నీళ్ల ట్యాంకర్లదే రాజ్యమైందని తెలిపారు. మంచి రోజులు రావాలంటే బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోకసాని కొండల్‌రెడ్డి, ఆకుల అరవింద్ కుమార్, రిషి, సుశీలరెడ్డి, దర్పల్లి అశోక్, పి.రాజు, అరవింద్, ప్రత్యేశ్ ఉన్నారు.

మత రాజకీయాలు చేస్తున్న ఎంఐఎం, బీజేపీని ఓడించాలి

సైదాబాద్, మే 7: పాతనగరంలో మత రాజకీయాలు చేస్తున్న ఎంఐఎం, బీజేపీని ఓడించాలని, సెక్యూలర్ వ్యవస్థను బలపరిచే ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఈటీ నర్సింహ తెలిపారు. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణికాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన సీపీఐ హైదరాబాద్ పార్లమెంట్ నియోజవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో కోట్లాది ఉద్యోగావకాశాలను కల్పిస్తానని చెప్పి, ప్రజలందరిని ప్రధాని మోదీ మోసం చేశాడని.. కార్పొరేట్ సంస్థలకు లక్షలాది కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేసి, పేద ప్రజలకు ఇచ్చే సబ్సిడీలను పథకాలను రద్దు చేయటానికి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణ కోసం మరోసారి బీజేపీనే గెలిపించండి

మన్సూరాబాద్, మే 7: దేశ రక్షణ కోసం మరోసారి కేంద్రంలో బీజేపీని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి లెక్చరర్స్‌కాలనీ, ఆదిత్యనగర్, టీనగర్, ఎల్లారెడ్డికాలనీ ఫేజ్-1, ఎల్లారెడ్డికాలనీలో ఆయన ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన కార్యాచరణకు ప్రజలు బాసటగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, హరీశ్‌రెడ్డి, కడారి యాదగిరియాదవ్, పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.